ప్రజాశక్తి

శనివారం 5 జూలై 2025

8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

బెట్టింగ్ కేంద్రంగా విశాఖ

◆ పెరుగుతున్న కేసులు ◆ ఆగమవుతున్న యువత బతుకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నయా జూదమైన 'క్రికెట్ బెట్టింగ్'లకు కేంద్రంగా మారిపోయింది. వన్డే, టెస్టు, టి-20, ఐపిఎల్.. ఇలా పేరు ఏదైనా బెట్టింగ్స్ నిరంతరాయంగా సాగుతున్నాయి. వీటి పునాదులు బెంగళూరు వంటి ప్రాంతాల్లో ఉన్నట్టు దొరికిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. విశాఖ పోలీసులు నిత్యం ఈ బెట్టింగు రాయుళ్లపై నిఘా పెట్టి ప్రతిరోజూ విధిగా దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బృందాలను పంపించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో ఈ బెట్టింగ్ ముఠాలకు సంబంధించి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మరోవైపు బెట్టింగ్ వ్యసనాలకు బానిసలైన యువత బతుకులు ఆగమవుతున్నాయి. ఎండాడలో ఉంటున్న డోలా రాము గురువారం ఆత్మహత్యకు పాల్పడమే దీనికి నిదర్శనం. అతడు బెట్టింగ్స్‌కు అలవాటు పడి అప్పులపాలై తుదకు బలవర్మణానికి పాల్పడ్డాడు.



బెట్టింగ్ ముఠా నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న పరికరాలు (ఫైల్)

ముఠాల గుట్టురట్టవుతున్నా..

మారికవలసకు చెందిన ఒక వ్యక్తి తాను మోసపోయానంటూ మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెంటనే స్పందించి బెంగళూరులో 15 మంది బెట్టింగురాయుళ్లను పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను గురువారం సిపి శంఖబ్రత బాగ్చి మీడియాకు వెల్లడించారు. క్రికెట్‌పై పిచ్చి అభిమానంతో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని పలువురు జూదగాళ్లు మోసాలకు తెరతీస్తున్నారు. వ్యక్తుల బలహీనతలను సొమ్ముచేసుకునేలాగ ఆన్‌లైన్‌లో ఈ బెట్టింగులకు వల విసురుతున్నారు. బెంగళూరులో 15 మందిని అరెస్ట్ చేసిన వ్యవహారంలో సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగులు ఐపిఎల్ సందర్భంగా జరిగాయన్నది పోలీసులు భావిస్తున్నారు. అప్పులు చేసెయ్యడం, ఇంట్లో బంగారం తాకట్టుపెట్టేయడం లేదా అమ్మేయడం వంటి పనులకు సైతం యువత వెనుకాడటం లేదు. బెట్టింగుల్లో పోగొట్టుకోవడం, తీరా డబ్బులు పోయాక పోలీసులను ఆశ్రయించడం విశాఖలో ఆనవాయితీగా మారిపోయింది.

బెట్టింగుల్లో రూ.వందల కోట్లు.. పోలీస్ రికవరీల్లో రూ.కోట్లే లభ్యం

ఈ ఏడాది జనవరిలో బెట్టింగ్ గ్యాంగుల స్థావరాలపై పోలీసులు దాడులు చేపట్టగా పెదవాల్తేరులోని అపార్ట్‌మెంట్‌లో ఒక బుకీ పట్టుబడ్డాడు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి దాదాపు 80 బ్యాంకు ఖాతాల్లోని రూ.45 లక్షలను సీజ్ చేశారు. నిందితులు బెట్టింగ్‌లను నిర్వహించి రూ.178 కోట్ల మేర లావాదేవీలు జరిపినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో ప్రధాన నిందితులతో సహా ఒక్కొక్కరినీ అరెస్టు చేసే పనిలో పోలీసులు ఉన్నారు. ప్రస్తుతానికి మిగతా 2లో..

విమల విద్యాలయాన్ని ప్రారంభించాలి

◆ మూసివేత చర్యల్లో భాగంగా

విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే ఇచ్చిన లెటర్లను వెనక్కి తీసుకోవాలి

◆ లేనిపక్షంలో నేడు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన

◆ సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు



లేఖలు చూపుతున్న గంగారావు, జగన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయ స్కూల్‌ను వెంటనే ప్రారంభించాలని, ఆ స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగించాలని విశాఖ ఎంపీ శ్రీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ఇచ్చిన లేఖలను వెనక్కి తీసుకోవాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూలు మూసివేతకు విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలే బాధ్యులని చెప్పారు. వారిద్దరూ ఇచ్చిన లేఖలను ఉపసంహరించుకోకపోతే ఈ నెల 5న ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామన్నారు.

ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన విశాఖ విమల విద్యాలయాన్ని నేటికీ ప్రారంభించకుండా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందన్నారు. ప్రభుత్వ చర్య వల్ల 1600 మంది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. విమల విద్యాలయం స్కూలును 1984 నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్వహిస్తోందన్నారు. ఈ స్కూలుకు తోడు గంట్యాడలో నడుస్తున్న బ్రాంచిలో మరో 500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. గత నెల 23న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, స్కూల్ నిర్వహిస్తున్న డైసిస్ సంస్థ, ఉపాధ్యాయుల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. దీని ప్రకారం విమల విద్యాలయం మిగతా 2లో..

నేడు జాతీయ లోక్ అదాలత్

▶ వార్త 4లో..

చోడవరం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

▶ వార్త 5లో..

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

▶ వార్త 4లో..

బాలికపై అత్యాచారయత్నం

నిందితుడు అరెస్టు, రిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 ఏళ్ల బాలికపై స్విగ్గీ బాయ్ అత్యాచారయత్నం చేశాడు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. సదరు వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. యువకుడు పిన్నింటి చంద్రశేఖర్ రణస్థలం నుండి విశాఖకు ఉపాధి కోసం వలస వచ్చాడు. రామాటాకీస్ సమీపంలోని వినాయకనగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్విగ్గీలో విధులు నిర్వహిస్తున్నాడు. అదే వీధిలో ఉంటున్న ఓ చిన్నారిపై అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం కెజిహెచ్‌కు తరలించారు. ఎసిపి లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వందే భారత్‌కు అదనపు కోచ్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత్ రైలుకు శాశ్వత ప్రాతిపదికన నాలుగు అదనపు కోచ్‌లు జతచేశారు. ఈ విషయమై రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో 20707 సికింద్రాబాద్ - విశాఖపట్నం, 20708 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ రైలుకు ప్రస్తుత కూర్పుకు అదనంగా నాలుగు ఎసి చైర్ కార్ కోచ్‌లను జత చేశారు. ప్రస్తుతం 14 ఎసి చైర్ కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తున్న ఈ రైలు శనివారం నుంచి 18 ఎసి చైర్ కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో నడువనుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

ఘనంగా అల్లూరి జయంతోత్సవాలు

సీతారామరాజు స్ఫూర్తితో నేటి సామ్రాజ్యవాదంపై పోరాడాలి : సిహెచ్.నర్సింగరావు



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

బ్రిటిష్ వారికి కంటిమీద కునుకు లేకుండా పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు అన్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గురజాడ సాంస్కృతిక వేదిక నిర్వహణలో అల్లూరి 128వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నృత్యాలతో చిన్నారులు కట్టిపడేశారు. వేషధారణలు 'ఔరా' అనిపించాయి. జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన గిరిజనులను ఐక్యం చేసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అల్లూరి నిలబెట్టారని తెలిపారు. బ్రిటీష్‌వారి దౌర్జన్యాలను, పోలీసు బలగాలను ఎదుర్కోవాలంటే ఆయుధాలు అవసరమని భావించి పోలీస్ స్టేషన్లపై ముందుగా చెప్పి మరీ దాడి చేసి ఆయుధాలను సమకూర్చుకొని పోరాటం సలిపారన్నారు. ఆయన ఆ రోజు సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడంలో తన జీవితాన్ని మిగతా 2లో..



అల్లూరి జయంతోత్సవాల్లో నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

మొదటి పేజీ తరువాయి..

బెట్టింగ్ కేంద్రంగా విశాఖ

అరెస్టు అయిన నిందితుల సంఖ్య ఆ కేసులో 13కి చేరింది. బెట్టింగుల్లో రూ.వందల కోట్లు చెలామణిలో ఉన్నప్పటికీ పోలీసులు రికవరీల్లో మాత్రం ఈ ఆరు నెలల కాలంలో రూ.15 కోట్లు లోపే చేశారు. ఇటీవలే సుమారు రూ.5 కోట్ల మేర బాధితులకు ఇచ్చినట్లు విశాఖ పోలీస్ కమిషనర్ చెప్పారు. ఇంకా రూ.10 కోట్ల మేర తమ వద్ద ఉందని మీడియాతో వెల్లడించారు. ఐపిఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ఈ ఉచ్చులో చిక్కుకొని ఎంతో మంది పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. వడ్డీ వ్యాపారుల వద్ద పెద్ద ఎత్తున అప్పులు చేసిన వారు అనేక మంది ఉన్నారు. ఈజీ మనీ కోసం అత్యాశతో బెట్టింగ్ ముఠా వలలో ప్రధానంగా యువత, ఆటోడ్రైవర్లు, భవన కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారులు చిక్కుకుంటున్నారు.

రాజకీయ ప్రముఖుల అండదండలు

అరెస్టు అయిన వారిలో ప్రధాన నిందితులకు ఎక్కువగా రాజకీయ నేపథ్యం ఉంటోంది. రాజకీయం అనేది ఒక వ్యాపారంగా మారిపోవడంతో అందులో మిగిలిన రూ.కోట్ల డబ్బును క్రికెట్ బెట్టింగుల్లోకి మార్చడం ఒక ట్రెండ్‌గా ఉంది. బెట్టింగ్‌ల్లో అరెస్టయిన వారిలో కొంతమంది ప్రస్తుతం బెయిల్‌పై బయటే ఉన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన పలువురు ఈ ఊబిలోకి పలువుర్ని లాగుతున్న సమాచారం విశాఖ పోలీసుల వద్ద ఉంది. నగర శివారులోని పలు కాలనీల్లో అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకుని నిందితులు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు.

బెట్టింగుల్లో 'దొంగా పోలీస్' ఆట

బుకీల కదలికలు, బెట్టింగ్‌లపై పక్కా సమాచారం ఉన్నా కొందరు పోలీసు సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదని సమాచారం. ఇటీవల పట్టుబడిన ముఠాతో సంబంధాలు ఉన్నాయని రుజువు కావడంతో స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు కూడా పడింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల మోసపోయినవారు ఫిర్యాదు చేస్తే నిందితులు ఎవ్వరైనా అరెస్టు చేస్తామని విశాఖ సిపి శంఖబ్రత బాగ్చీ ఇటీవల ప్రకటించడం పోలీసుల్లోనూ గుబులు రేపుతోంది.

ఘనంగా అల్లూరి జయంతోత్సవాలు

అర్పించారన్నారు. ఇప్పుడు అదే సామ్రాజ్యవాదం మరో రూపంలో మన దేశాన్ని లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. దానికి వ్యతిరేకంగా అల్లూరి స్ఫూర్తితో కదలాలని పిలుపునిచ్చారు. జన చైతన్యానికి, కళాకారులకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం గొప్ప వేదికగా నిలుస్తోందన్నారు. విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి జయంతి సందర్భంగా నగరంలోని 45 స్కూళ్లలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు ఇచ్చామన్నారు. సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. నేషనల్ బాక్సింగ్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జివి.రవిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అల్లూరి తన ప్రాణం త్యాగం చేశారని, ఆయన స్ఫూర్తిని అందుకుని మనం ఆయన బాటలో పయనించాల్సి ఉందన్నారు. కన్సర్న్ ట్రస్ట్ చైర్మన్ పికె.జోస్ మాట్లాడుతూ త్యాగధనులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. 'మన్యం ధీరుడు' సినీ నిర్మాత ఆర్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి, భగత్‌సింగ్, గాంధీ, నేతాజీలు అందరికీ స్ఫూర్తిప్రదాతలన్నారు. అల్లూరి జీవితాన్ని రేఖా మాత్రంగా తెలియజేయడమేగాక తన శ్రావ్యమైన కంఠంతో తన సినిమాలోని ఒక పాటను పాడి వినిపించారు. విజ్ఞాన కేంద్రం ట్రస్టు కోశాధికారి వివిఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ అల్లూరి లాంటివారు ఆనాడు కుల, మత, భాషా భేదాలకు అతీతంగా ప్రజలందరినీ ఐక్యంచేసి పోరాడి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టారని తెలిపారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి జయంతి ఉత్సవాల్లో దాదాపు 265 మంది కళాకారులు పాల్గొన్నారన్నారు. వేదిక కోశాధికారి ఆర్‌ఎస్‌ఆర్.మూర్తి ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమానికి వేదిక అధ్యక్షులు పివి.రమణ అధ్యక్షత వహించారు.

విమల విద్యాలయాన్ని ప్రారంభించాలి

స్కూల్‌ను వెంటనే ప్రారంభించడానికి అంగీకరించారన్నారు. తక్షణమే స్కూల్ గుర్తింపునకు అవసరమైన లెటర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పంపించడానికి అంగీకరించిందని తెలిపారు. పాఠశాలను ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్లాంట్ యాజమాన్యం డైసిస్ సంస్థను ఆదేశించిందన్నారు. ఆ సంస్థ విద్యార్థుల చేత పుస్తకాలు కూడా కొనిపించి స్కూలు ప్రారంభించడానికి అన్ని చర్యలూ తీసుకుందన్నారు. అయితే, జూన్ 25న ఎంపీ శ్రీ భరత్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి విశాఖ విమల విద్యాలయం స్కూలును మూసి వేస్తున్నారుగనుక అందులో పని చేస్తున్నటువంటి టీచర్లు అందరికీ విఆర్‌ఎస్ ఇచ్చి పంపించాలని లేఖ రాశారన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఇదే విధంగా లెటర్ రాశారన్నారు. దీంతో స్కూలు ప్రారంభం ఆగిపోయిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే చర్యను విశాఖ ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని, టిడిపి, జనసేన, బిజెపి కూటమి చేస్తున్నటువంటి దగాను నిరసించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ పాల్గొన్నారు.

సామాన్యులకు సహకారం అందించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సామాన్యులు, రైతుల ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు సహకారం అందించాలని, వార్షిక రుణప్రణాళిక ప్రకారం సేవలను మరింత విస్తరించాలని, రుణమంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ సమావేశ భవనంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. స్వయం సహాయసంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో రెన్యువల్ చేయాలని అన్నారు.

ఎల్‌ఐసి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్‌ఐసిలో పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్‌ఐసి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌ఐసి ప్రధాన కార్యాలయం వద్ద 'ఆల్ ఇండియా డిమాండ్స్ డే' పాటించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎఐఐపిఎ మాజీ ఉపాధ్యక్షులు కె.మోహనరావు, ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్ మాట్లాడారు. పెన్షన్‌ను కాలానుగుణంగా నవీకరించాలన్నారు. 20 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన తర్వాత పూర్తి పెన్షన్ ఇవ్వాలని, సర్వీస్‌లోని చివరి నెల తీసుకున్న జీతంపై పెన్షన్ నిర్ణయం చేయాలని అన్నారు. వివక్షత లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లింపు జరగాలన్నారు. 1986 ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి ఎక్స్‌గ్రేషియా పెరుగుదల, 1997 ఆగస్టు ముందు పెన్షనర్లకు యూనిఫాం, డిఎ న్యూట్రలైజేషన్ చెల్లింపు వంటి విషయాలు ప్రభుత్వం వద్ద, యాజమాన్యం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులతో వీటిపై ఎఐఐపిఎ నాయకత్వం పదేపదే చర్చిస్తున్నప్పటికీ ఫలితం లభించలేదన్నారు. కార్యక్రమంలో కన్సనేర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్‌వివిబి.పరమానందరావు, బి.సత్యనారాయణ, బిజికె.రెడ్డి, సహాయ కార్యదర్శి పిఆర్‌ఎస్.ప్రసాద్, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఐసిఇయు డివిజన్ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ఎన్‌ఎఫ్‌ఎఐఎఫ్‌డబ్ల్యుఐ జనరల్ సెక్రటరీ వి.రవి కుమార్, ఎస్‌ఐసి క్లాస్ - 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు త్రినాథ్‌రావు వారి పోరాటానికి సంఘీభావం తెలిపారు.

అనకాపల్లి : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శుక్రవారం డిమాండ్స్ డే నిర్వహించారు. అనకాపల్లి జీవిత బీమా శాఖ కార్యాలయంలో గేటు మీటింగ్ పెట్టుకుని వారి డిమాండ్స్ డేను అబ్జర్వ్ చేశారు. ఫ్యామిలీ పెన్షన్‌లో పెంపుదల, మెడిక్లేయిమ్‌లో మెరుగుదల, 80 సంవత్సరాలు నిండిన వారికి పూర్తి పెన్షన్ ఇవ్వడం వంటి అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి, పరిసర ప్రాంతాల విశ్రాంత ఉద్యోగులు, జీవిత బీమా ఉద్యోగులు, డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విశాఖలో డిమాండ్స్ డేలో పాల్గొన్న ఎల్‌ఐసి పెన్షనర్లు

శరవేగంగా ట్రాక్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోలాపూర్ - జైపూర్ విభాగంలో కొండ చరియలు విరిగిపడిన రెండు రోజుల్లో రైలు సేవలు రికార్డు స్థాయిలో పునరుద్ధరించబడ్డాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న కురిసిన భారీ వర్షాల కారణంగా కోరాపుట్ - కిరండోల్ లైన్‌లో జరాటి - మాలిగూడ స్టేషన్ల మధ్య విరిగిపడిన కొండ చరియలను తొలగించే పనిని ఈస్ట్ కోస్ట్ రైల్వే విజయవంతంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందితోపాటు 300 మంది సిబ్బంది, 16 భారీ యంత్రాలు రంగంలోకి దిగాయన్నారు. వాల్తేరు డిఆర్‌ఎం లలిత్ బొహ్రా, రాయగడ డిఆర్‌ఎం అమితాబ్ సింఘాల్, ఇతర సీనియర్ అధికారులు అక్కడే ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారని తెలిపారు.

గ్రూప్-2, గ్రేడ్-2 ఉద్యోగులకు నేడు సిపిటి పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని గ్రేడ్-2 ఉద్యోగులకు, గ్రూప్ -2 ద్వారా ఎంపికైన ఉద్యోగులకు శనివారం మూడు సెక్షన్లలో సిపిటి (కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్టు) పరీక్ష జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్ ఆదేశించారు. ఎగ్జామ్ సెక్షన్, లైజనింగ్ అధికారులతో శుక్రవారం ఉదయం తన ఛాంబర్లో సమీక్షించిన ఆయన వివిధ అంశాలపై సూచనలు చేశారు. మొదటి సెక్షన్ పరీక్ష ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, రెండో సెక్షన్ 1 నుంచి 2 గంటల వరకు, మూడోది 4.30 నుంచి 5.30 గంటల వరకు ఉంటుందని వివరించారు.

IN THE HONOURABLE COURT OF VIII ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA

E.P. 01/2020 IN O. S. 351/2008

Between:
Sri Joseph Chandra Prakash Madhura ...D.Hr.
And
Sri Jagmohan Chopra & others ....J.Drs.
To
J.Dr.No.2:
Mr.Datla Venkata Subbaraju, S/o.late Dharma Raju, Hindu, residing at Flat No.F-4, Srinidhi Apartments, Old Gajuwaka, Visakhapatnam.

Please take notice that the above named D.Hr filed the above E.P. against you and others and the matter is coming for your appearance in the above proceedings and stands posted to **10-07-2025,** on that day you should personally or through Advocate attend before the above said Hon'ble Court at **10-30 A.M.** failing which the matter will be heard and determined in your absence ex parte as per law.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S. PRABHA, Advocates
Visakhapatnam
Ph: 0891-2755164

(NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC)
IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.No. 189/2021 IN DISPUTE No:214/2015

Between:
M/S Margadarsi Chit Fund Private Limited, M.V.P. Colony Branch, Visakhaptnam-17. Reptd. By its Manager ..... Petitioner Decree Holder.
And:
A.Raja Rao and 5 Others
..... Respondant/ Judgement Debtors.
To:
Jdr1) Mr.Alla Raja Rao, S/o A.Ramu, Hindu Aged 44 Years, D.No.45-2-60/2/7 Ramachandra Nagar, Akkayya palem, Visakhapatnam-16, Shop No.25, New Wholesale, Market (Veg) Shop, Convent Junction, Visakhapatnam-04
Jdr3) Mr's.Alla Veena Madhavi, W/o A.Raja Rao, Hindu Aged 36 Years, D.No.45-2-60/2/7, Ramachandra Nagar, Akkayya palem, Visakhapatnam-16, Shop. No.25 New Wholesale, Market (Veg) Shop, Convent Junction, Visakhapatnam-04.
. . .Respondant/ Judgement Debtors

NOTICE

Whereas in the above-mentioned E.P.No.189/2021 in Dispute No. 214/ 2015 the decree - holder has applied for the sale of immovable property belongs to you i.e Jdr -1 and 3. You are hereby informed that the **21-07-2025** has been fixed for setting the terms of proclamation of sale, for Your appearance in the above court at 10:30 A.M. If you fail to attend the Court on that day the matter will be heard and decided ex party.

P.MURALI GOPAL
ADVOCATE.
VISAKHAPATNAM. Visakhapatnam.
DATE: 04-07-2025. Cell : 9848320248

మహా రాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్) ఎలమంచిలి వారి కోర్టులో

O.S.310/22

పడాల శ్రీనివాస్ రెడ్డి ...వాది
ఆసం రామారావు ...ప్రతివాదులు
టు
ఆసం రామారావు S/o సత్యనారాయణ 56 వయసు, వ్యాపారం. డోర్ నెంబర్ 12-117/6/1, బస్తీ పెందుర్తి, విశాఖపట్నం.
ఆసం లలిత W/o రామారావ్, 46 వయసు, గృహిణి. డోర్ నెంబర్ 12-117/6/1, బస్తీ పెందుర్తి, విశాఖపట్నం..
దుంపల హేమ సుందరరావు S/o కేశవరావు, వ్యాపారం, డోర్ నెంబర్. 24-79-56/1, బస్తీ, సనత్ నగర్, గాజువాక, విశాఖపట్నం.

ఈ నెంబర్ దావా వాది మీ పై తనకు రావలసిన తనఖా దావాబాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా దావా లో మీరు సమన్లు తీసుకొనక కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారు పై పేపర్ పబ్లికేషన్‌కు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. సదరు దావా **తేదీ. 28-7-2025కి వాయిదా** అయి ఉన్నది. ఆ రోజు **ఉదయం గం. 10.30 నిమిషాలకు** మీరు స్వయం గా కానీ, లేదా మీ తరపు వకీలు ద్వారా గానీ కోర్టుకి హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేని యెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ : 28-7-2025

Y. రాఘవేంద్రరావు,
వాది తరపు న్యాయవాది,
గాంధీనగర్ ఎలమంచిలి.
ఫోన్ : 9440559429.

NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC
IN THE HONDURARLE COURT OF THE FAMILY COURT JUDGE AT VIZIANAGARAM
EP 151/2021 in AA 599/2019

Between:
M/s. Shriram Transport Finance Company Ltd.,rep., by its G.P.A Holder, Mr. Vaddadi Vijay ...DHr
And:
1) Bhagya Lakshmi Golagani
2) Venkata Srinivasa Prasad Vanjarana
3) Golagani Venkata Govardhan Satish Kumar ...JDrs

NOTICE TO 1ST JDR

Golagani Bhagya Lakshmi, W/o.Golagani Venkata Govardhan Satish Kumar, residing at DNo. Flat No: 402, Heritage Raja Reddy Apartment, Marripalem, Vuda Layout, Visakhapatnam-530018.

Whereas you have failed to satisfy an Award passed against you in A.A.599/2019, in favor of the Dhr and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the EP schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions of CPC to satisfy the EP amount of Rs.6,94,940/-

Whereas it is ordered by the Honourable Court that notice under Order 21 rule 64 of CPC by way of this Publication Notice since you are avoiding to take notice through Court and Registered Post. Therefore, it is ordered that you should attend to the Honourable Family Court Judge **on 11-07-2025 at 10.30 AM** before the Court, in person or through your Advocate failing which the matter would be decided in your absence by setting you exparte.

M. SRINIVAS RAO, ADVOCATE,
D-No. 4-3-36, Kotha Agraharam, 2nd Lane Vizianagaram District
CELL: 9490898234

వేలం ప్రకటన
మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
EP 120/2014 IN OS 155/2009

కొణతాల నూకయ్య నాయుడు . . . DHR వాది
Vs
శరగడం శివ వెంకట సత్యనారాయణ . . . JDR ప్రతివాది.

పై నెంబరు అమలులో DHR కు JDR ప్రతివాది నుండి వసూలు కావలసిన డిక్రీ బాకి రాబట్టే నిమిత్తం JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కోర్టు వారు **తే 25-7-2025దిని ఉదయం 10:30 నిమిషముల** నుండి వేలం వేయుదురు. కావున వేలం పాటలో పాల్గొదలిచినవారు పై కోర్టులో హాజరై. కోర్టు వారి షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూల్ :- విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలం, అనకాపల్లి సబ్ రిజిస్ట్రీ. అనకాపల్లి పట్టణం, పూడిమడకరోడ్‌లో గల, డో.నెం. 12-4-21 మరియు అసెస్మెంట్ నెంబర్ 256 & 9177/14 నెంబరు కలిగిన పెంకు ఇల్లుకి హద్దులు.
తూర్పు:- పూడిమడక రోడ్డు.
ఉత్తరం:- ఈ ఆస్తికి మరియు షేక్ మీరా సాహెబ్ ఆస్తికి మధ్య మందడి గోడ.
పడమర:- దేవాంగుల మాణిక్యం గారి స్థలము మరియు ఇల్లు.
దక్షిణం :- మళ్ల వెంకటరమణ ఆస్తి.
కొలతలు:- తూర్పు నుండి పడమరకు 60 అడుగులు/18.29 మీటర్లు.
ఉత్తరం నుండి దక్షిణముకు 9 అడుగులు/ 2.71 మీటర్లు.
DHR విలువ రూ 1,50,000/-
అమీనా విలువ రూ 8,00,000/-
JDR విలువ నిల్
మార్కెట్ రేటు: రూ 23,22,000/-

కేలం చంద్రశేఖర్
DHR తరపు అడ్వకేట్. అనకాపల్లి.
సెల్: 9959378278.

కంచరపాలెం సిఐగా రవికుమార్



కవిటి రవికుమార్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సిఐగా కవిటి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ విజయనగరం, గరివిడి, సీతానగరం, కొత్తవలస, ఎస్.కోట, జిఆర్ పిఎఫ్‌లో ఎస్ ఐ గా విధులు నిర్వహించారు. అనంతరం 2021లో సిఐగా ప్రమోషన్ పొంది, విశాఖ సిటీ స్పెషల్ బ్రాంచ్, రాజాం టౌన్, పార్వతీపురం,ఎస్ కోట సర్కిల్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం సిసిఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన ఇటీవలే కంచరపాలెం ఇంచార్జ్ సిఐగా బాధ్యతలు చేపట్టి, ఇపుడు సిపి ఆదేశాలతో అక్కడే కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సిఐగా విధుల్లో చేరారు.కంచరపాలెం సిఐగా పనిచేసిన చంద్రశేఖర్ సిసిఎస్ -వి 1కు బదిలీపై వెళ్లారు. సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన సిఐ రవికుమార్, పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించారని సూచించారు

విద్యార్థులకు యోగా శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్ర వారం ఒకరోజు పాటు యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ విష్ణు మూర్తి మాట్లాడుతూ , యోగాను జీవన విధానంగా మార్చుకోవాలని యువతకు పిలుపు నిచ్చారు. సంస్రయ ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ లీలాప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు, యోగా ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విశాఖ మై భారత్, సంస్రయ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

ప్రజాశక్తి - పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చిన్నముషిడివాడ శ్రమశక్తి నగర్ ఘంటసాల పార్క్, ఏకలవ్య కాలనీల్లో జివిఎంసి నిధులు రూ.18 లక్షలతో పార్కుల్లో జిమ్‌ల ఏర్పాటుకు స్థానిక కార్పొరేటర్ వసంత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సేనాపతి శంకరరావు, శంకర్‌ప్రసాద్, మూర్తి, చిన్నాజీ, రాము, పాల్గొన్నారు

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



వెల్లంకిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-ఆనందపురం: తడిపొడి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని జిల్లా పంచాయతీ అధికారి ఎంవిఎ. శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఉదయం ఏడుగంటలకే మండలంలోని వెల్లంకి గ్రామ పంచాయతీలో ఆకస్మికంగా పర్యటించి, ఇంటింటా తడిపొడి చెత్తసేకరణపై స్వయంగా పరిశీలించారు. రిక్షాల ద్వారా రోజువారీ చెత్త సేకరణ జరుగుతుందా, లేదాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, తడి,పొడి చెత్త వేరు చేసి ఇస్తున్నారా లేదా అన్నది తెలుసుకోవడంపై గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి, సిబ్బందితో మాట్లాడారు.

సేకరించిన చెత్తను వర్మీకంపోస్టుగా తయారీపై పరిశీలించారు. స్థానిక రైతులకు దీనిపై అవగాహన కల్పించి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంపై సమీక్షించారు. తనిఖీలో గ్రామ కార్యదర్శి శ్రీ రామ్మూర్తి, పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'సుపరిపాలనకు తొలి అడుగు'



కశింకోటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న దాడి రత్నాకర్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో శుక్రవారం సపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెలే గంటా శ్రీనివాపసరావు పాల్గొని, ఇంటింటి వెళ్లి కూటమి పాలన ఏడాదిలో చేపట్టి, అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. ఏడాది పాలనపై కరపత్రాలను పంచారు.

కశింకోట : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరసింగిబిల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి దాడి రత్నకర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు సంక్షేమమే టిడిపి ముఖ్య ఉద్దేశమని చెప్పారు. పార్టీ నాయకులు వేగి దొరబాబు, కొన నర్సింగరావు, మజ్జి నిరంజన్‌కుమార్, కొన సురేష్, షేక్ దర్గా, మేడిశెట్టి వెంకటరమణ, ఆనాల తాతీయ్య నాయడు పాల్గొన్నారు.

చీడికాడ:రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్య నారాయణమూర్తి తెలిపారు. ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ పివిజి కుమార్, మాజీ జెడ్పిటిసి పి.సత్యవతి పి రమణమ్మ మండల పార్టీ అధ్యక్షుడు పాతల చిన్నం నాయుడు పాల్గొన్నారు. చుక్కపల్లి, చెట్టుపల్లి గ్రామాల్లో పథకాలను వివరించారు.ఈ కార్యక్రమంలో జలాశయం మాజీ చైర్మన్ జి ముసలి నాయుడు, సర్పంచ్ గణేష్, మాజీ సర్పంచ్ దాలి నాయుడు పాల్గొన్నారు.

రావికమతం: ఏడాది కాలంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని చోడవరం శాసనసభ్యులు రాజు తెలిపారు. మరివలస, కన్నంపేట, వోమ్మ వరం, కొత్తకోట గ్రామాల్లో ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు రాజాన శ్రీవాణి కొండనాయుడు, చోడవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, కోట గోవిందు, సర్పంచు జోగి పాత్రుడు, చోడవరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ నానిబాబు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం. ప్రకృతి వ్యవసాయానికి జీవం పోసే ఘన జీవామృతం తయారీపై స్థానిక రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నేచరల్ ఫార్మింగ్ ఐసిఆర్‌పి రమణమ్మ పాల్గొని ఘనజీవామృతం తయారీపై ప్రయోగాత్మకం చేసి చూపించి, దాని ప్రయోజనాలను వివరించారు. ఆవుపేడ, మూత్రం, శనగపిండి, బెల్లం, పుట్టమట్టితో తయారుచేసే ఘనజీవామృతం వినియోగంతో నేలలో సూక్ష్మజీవులు పెరిగి, మొక్కలకు శక్తివంతమైన పోషణ, మట్టిలో తేమ నిల్వ పెరిగి, పంటలకు మేలు జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా రైతుల సురాల శ్రీను ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను తోటి రైతులకు వివరించారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి



ములగాడ లోరంగాకు నివాళులర్పిస్తున్న నానాజీ

ప్రజాశక్తి- ములగాడ : హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద వంగవీటి మోహన రంగా జయంతిని శుక్రవారం నిర్వహించారు. విశాఖ జిల్లా కాపు తెలగ, బలిజ సంఘం అధ్యక్షులు, శ్రామిక శక్తి లేబర్ యూనియన్ వ్యవస్థాపకులు పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో పలువురు కార్మికులు, రంగా అభిమానులు పాల్గొన్నారు

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబులు నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు (శ్రీను), రమణ, సిహెచ్ వెంకటేశ్వరరావు, దొరబాబు, వాసు,సుంకర శ్రీను, దుర్గ, బాబ్జి, లోవ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, ఉద్దన్నపురం గ్రామాల్లో కూడా రంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ 4వ వార్డ్ కాపు వీధిలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు దాడి రామకృష్ణ (బుజ్జి) కాపు వీధి నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలో కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి కాపు నాయకులు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైసిపి అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయి బాబా పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం పంచాయతీ పరిధి అన్నవరం గ్రామంలో వంగవీటి మోహన్ రంగ 78వ జయంతి వేడుకలు అన్నవరం యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వంగవీటి విగ్రహానికి గ్రామ పెద్దలు, వంగవీటి రంగా రాధా మిత్రమండలి సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో వంగవీటి అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దాడి కేసులో నిందితునికి ఐదు నెలల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : అకారణంగా వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఐదు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ విశాఖ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల సాదారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కేసులో వాదనలు వినిపించిన సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివి. 2023 అక్టోబర్ 29న సాయంత్రం బాధితుడు బచ్చురుశెట్టి రామమూర్తి కెజిహెచ్ నుంచి వస్తుండగా, రెల్లీవీధి క్లబ్ జంక్షన్ చికెన్‌షాప్ వద్ద నిందితుడు వడ్డాది పోలారెడ్డి అలియాస్ పోలరాజు అతనిపై అకస్మాత్తుగా చికెన్ కటింగ్ కత్తితో దాడి చేసి ఎడమ చెవి వెనుక భాగంలో గాయపరిచాడు. స్థానికులు బాధితునిని హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ కె.నూకరాజు విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితునికి ఈ మేరకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

55 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు 55 బస్తాల్లో సుమారు 2,750 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. వివరాలివి. అందిన సమాచారం మేరకు. శుక్రవారం తెల్లవారు జామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదర్శనగర్ ప్రభుత్వాసుపత్రి వద్ద ఎపి 39 యుజి 4979 బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని మాటు వేసి పట్టుకుని, ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని తరలిస్తున్న విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన చెల్లిబోయిన సోమేష్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు అరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపారు.

దివీస్‌లో భద్రతపై మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దివీస్ సేఫ్టీ టీం

ప్రజాశక్తి-తగరపువలస : చిప్పాడ దివీస్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. తెలంగాణలో ఫార్మా కంపెనీలో ఇటీవల ప్రమాదం నేపథ్యంలో విశాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ వి.సురేష్ పరిశ్రమలో భద్రతా చర్యలను పరిశీలించారు. దివీస్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్, భద్రతా కమిటీ సమావేశం, ఇన్‌స్పెక్షన్‌లో పాల్గొన్నారు.

పౌడర్ ఫైర్ ఎక్స్‌ప్లోజివ్, సాల్వెంట్ ట్యాంక్, ఫాంఫైర్, ఎక్స్‌ప్లోజన్‌పై నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు.. ప్రతి ఎమర్జెన్సీ టీం మెంబర్ చాలా నిబద్ధతతో , ఏకాగ్రతతో మాక్ డ్రిల్ ర్వహించారని ప్రశంసించారు. ఎమర్జెన్సీ టీం సభ్యులను పరిశ్రమ డైరెక్టర్ ఎస్ దేవేందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్ వి రమణ పేరు పేరునా అభినందించారు.పరిశ్రమ భద్రతా విభాగం అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భద్రతా సమావేశం నిర్వహించారు. పరిశ్రమ జిఎం కె సుబ్బారావు, ఎజిఎం, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పద్మనాభం మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 5న శనివారం ఉదయం కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపిపి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ ఎం.విజయకుమార్ తెలిపారు.సమావేశానికి మండలంలోని అన్నిశాఖల మండల స్థాయి అధికారులు పూర్తి రికార్డులు, సమాచారంతో హాజరు కావాలని సూచించారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సంబంధిత ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా యాంటీ లార్వా ఆపరేషన్



పరిశీలిస్తున్న డిఎంఒ డాక్టర్ మీనాక్షి

ప్రజాశక్తి- సీతమ్మధార : వర్షాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో దోమలు విజృంభించి, మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాపించ కుండా సమర్ధవంతంగా చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.మీనాక్షి సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రంగిరీజు వీధిలో పర్యటించి, . క్షేత్ర స్థాయిలో దోమల నియంత్రణకు జరుగుతున్న ఫ్రైడే డ్రై డే యాక్టివిటీ, యాంటీలార్వా ఆపరేషన్స్, దోమల మందు స్ప్రేయింగ్, ఫీవర్ స్క్రీనింగ్ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మహిళలకు, స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. యాంటీ లార్వాఆపరేషన్ చేపట్టేందుకు 400మందిని నియమించామని, కేవలం గ్రౌండ్‌ఫ్లోర్‌కే పరిమితం కాకుండా మేడ పైఅంతస్తుల్లోనూ పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రంగిరీజు వీధిలో మలేరియా బారిన పడిన మహిళ ఇంటి పరిసరాలను పరిశీలించారు.కార్యక్రమంలో మలేరియా ఎడి కెవిఎస్. సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు, జివిఎంసి, యుపిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటలు కావివి..

ఆటోనగర్ రహదారులే!



- అధ్వానపు రోడ్లతో వాహనదారుల అవస్థలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

చెరువులా కనిపిస్తున్న డి బ్లాక్ రోడ్డు

ప్రజాశక్తి- గాజువాక : చిన్నపాటి వర్షానికి గాజువాక ఆటో నగర్‌లోని రహదారులు నీటికుంటలను తలపిస్తున్నాయి. వీటిని పరిష్కరించాల్సిన అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గాజువాక ఆటోనగర్ డి బ్లాక్ వద్ద ఉన్నా రహదారి ఏడాది క్రితం గోతులుగా ఏర్పడింది. దీనిని అభివృద్ధి చేయాలని స్థానికులు గతంలో చాలాసార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశ్యారు. నిధులు లేమి కారణంతో ఇన్నాళ్లు కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డులోని గోతులన్నీ నీటితో నిండిపోయి ప్రమాదభరితంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సరే అధికారులు స్పందించడం లేదని మండిపడుతున్నారు.

ఈ రహదారి ద్వారా శ్రీనగర్ నుంచి తోకాడ మీదుగా విశాఖ నగరానికి వెళ్లడానికి అనువైన రహదారి కావడంతో ఎక్కువ ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణిస్తారు. అంతే కాకుండా అన్న క్యాంటీన్ తో పాటు, భారీ పరిశ్రమలన్నీ ఈ రహదారి వెంబడి ఉన్నాయి.దీంతో వాహనాల రాకపోకల రద్దీ కూడా ఎక్కువగానే ఉంటోంది. ఇంతటి ట్రాఫిక్ ఉన్న రహదారి నిండా గోతులమయమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నా మరమ్మతులు, నిర్వహణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. రహదారి పునర్నిర్మాణం, అభివృద్ధి చేయడంలో అధికారులు, నేతల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిండాగోతులు, అందులో నీరు నిండి ఉండడంతో ఎక్కడ ఎంతలోతు గొయ్యి ఉందో తెలియని స్థితిలో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇదేమార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. నగరానికి వెళ్లాలంటే గాజువాకలో ట్రాఫిక్ సిగ్నల్ దాటి వెళ్లాలంటే సమయాభావం కావడంతో ఇదే మార్గాన్ని బైకిస్టులు, చిరువాహనదారులు ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు సైతం నీటి కుంటలను తలపిస్తున్న గోతుల్లో దిగి ముందుకు కదలనని మొరాయిస్తున్నాయంటే రోడ్డు దుస్థితి ఎలా ఉందో ఇట్టే స్పష్టమౌతోందని స్థానికులు అంటున్నారు. గోతుల్లో దిగబడి గంటల తరబడి లారీలు ముందుకు కదలకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాయని ఆటోనగర్ పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. తమ వ్యాపారాలపై ఇది తీవ్ర ప్రభావం చూసుతోందని ఆవేదన చెందుతున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందించి. అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులు చేపట్టి, రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని ఆటోనగర్ పరిశ్రమల యజమానులతో పాటు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

దీనిపై స్థానిక ఐలా కమిషనర్ వద్ద ప్రస్తావించగా,ఇ,డి బ్లాక్ రహదారితోపాటు, మరికొన్ని రహదారులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీని టెండర్లు పిలిచినట్లు తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

4710 కేసులు పరిష్కారానికి గుర్తింపు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాప్రాధికార సంస్థల ఆదేశానుసారం విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఈనెల 5న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 37 ప్రజా న్యాయ పీఠాలు జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసి కక్షిదారులకు ఖర్చు లేకుండా, సత్వర న్యాయం అందించనున్నట్లు తెలిపారు. బ్యాంకు చెక్కుల నిరాదరణ కేసులు, బ్యాంకు తగాదాలు, బీమా సంబంధిత కేసులు, కుటుంబ సంబంధిత కేసులు (విడాకుల కేసులు తప్ప), భూమి హక్కుల సంబంధిత కేసులు, రాజీ పడదగిన నేర సంబంధమైన కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసులు, ప్రజా పాలన సంబంధిత కేసులు రాజీ చేయ నున్నట్లు తెలిపారు. జిల్లా. నగరంలోని కోర్టులతో పాటు, గాజువాక, అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం, అరకు, మాడుగుల, భీమిలి పట్టణం తదితర కోర్టుల వద్ద ప్రజా న్యాయ పీఠాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనువైన 4710 కేసులు గుర్తించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు తెలిపారు,

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత




హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : విద్యారంగానికి బడ్జెట్ లో అత్యధిక నిధులు కేటాయిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పరదేశిపాలెంలో రూ.71.8 లక్షల దివీస్ సిఎస్ఆర్. నిధులతో మరమ్మతులు చేసిన ఎస్‌సి బాలికల హాస్టల్ భవనాన్ని పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలిలో తొమ్మిది ఎస్‌సి హాస్టళ్లలో దాదాపు వెయ్యిమంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి ఉత్తమమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థను దేశంలోనే నెంబర్ వన్ చేయడానికి విద్యా మంత్రి నారా లోకేష్ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు.

హాస్టల్‌లో అవసరమైన సౌకర్యాల కల్పనకు నిధులిస్తున్న దివీస్ యాజమాన్యాన్ని అభినందించారు. దివీస్ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సిఎస్ఆర్ ప్రతినిధులు సురేష్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరక్టర్ రామారావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, కార్పొరేటర్లు మొల్లి హేమలత, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు, కూటమి నాయకులు శాఖారి శ్రీనివాస్, సంతోష్ నాయుడు, నరసింహ నాయుడు, గాడు అప్పలనాయుడు, గరే గుర్నాథ్, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, వాండ్రాసి అప్పలరాజు, అచ్యుతరావు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు రోటరీ వైద్యసేవలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈ నెల 9న సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు విశాఖ రోటరీ క్లబ్ గ్రేటర్ సన్నాహాలు చేస్తోందని క్లబ్ నూతన ప్రెసిడెంట్ చింతా నేతాజీ తెలిపారు. శుక్రవారం ద్వారకానగర్‌లో మీడియాతో మాట్లాడుతూ, వీ హెల్త్ కేర్, ఏజ్ కేర్ ఫౌండేషన్, ఎరుమేలు అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో గిరి ప్రదక్షిణ భక్తులకు 30మంది వైద్యులతో కూడిన మూడు బృందాలు నిర్విరామంగా ఆరోగ్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ప్రథమ చికిత్సతోపాటు నొప్పుల నివారణకు అవసరమైన స్ప్రేలు, అత్యవసరానికి అంబులెన్స్, ఫిజియోథెరపిస్టల సేవలు వైద్యశిబిరాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. . పోర్టు స్టేడియం వెనుక రోడ్డులో నార్త్ గేట్ సమీపంలో సాయి షణ్ముఖ రెసిడెన్సీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని నేతాజీ తెలిపారు కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పి. భాస్కర నరేంద్ర జగన్, కమ్యూనిటీ మెడికల్ సర్వీసు డైరెక్టర్ డా. అశోక్ దేవరకొండ, పూర్వ అధ్యక్షులు ఎండీ. యాసిన్, బొచ్చు బ్రహ్మానందం, పి.నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ టి. కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వి. ప్రవీణ్, ట్రెజరర్ టి. సురేష్, క్లబ్ సర్వసెస్ డైరెక్టర్ బి. శంకర్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ కె.ఎమ్.కె. రమేష్, కె. ఫిరోజ్ ఖాన్, మురళి కష్ణ, పీర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సాయానికి సంప్రదించండి



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి - ఆరిలోవ :విశాఖ కేంద్రకారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సందర్శించారు. స్వర్ణముఖి బ్లాక్‌లో మహిళా ఖైదీలతో సంభాషించారు. జైలులో అందుతన్న సేవలపై ఆరా తీశారు.జైలు పాలవ్వడానికి కారణమైన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జైలుకు రావడం వల్ల వారి కుటుంబసభ్యులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఉచిత న్యాయసహాయానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి మహేష్ బాబు ఉప పర్యవేక్షాధికారులు ప్రవీణ్‌కుమార్, సూర్య ప్రకాష్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : ఈనెల 9న జరగబోయే గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నటు ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు అన్నారు. శుక్రవారం ఇఒ ఆధ్వర్యంలో ఎఇఒ రమణమూర్తి ఇఇ రామకృష్ణ, రాంబాబు, డిఇఇ రామరాజు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బందితో ఏర్పాట్లుపై పరిశీలించారు. అనంతరం వాటిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఇఒ త్రినాధరావు మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తుల దర్శనాలు త్వరితగతిన జరిగేలా సౌకర్యవంతమైన క్యూలైన్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, సిసి కెమెరాల ఏర్పాటు, తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కొండపైన, దిగువన ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, క్యూ లైన్ల నిర్వహణ, అన్న ప్రసాద విభాగం ద్వారా భక్తులకు ఫలహారాలు ఏర్పాట్లు,, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇఒ త్రినాధరావు

సబ్ పోస్టాఫీస్ మార్పు



చిన్న బజారులోకి మారిన సబ్ పోస్టాఫీస్

ప్రజాశక్తి –భీమునిపట్నం :స్థానిక పెద్ద బజారులో ఇప్పటి వరకు ఉన్న సబ్ పోస్టాఫీస్‌ను చిన్న బజారు పాత సినిమా హాల్ ఎదురుగా ఎస్‌బిఐ, ఎటిఎం, మీ సేవా కేంద్రాలు ఉన్న వాణిజ్య సముదాయంలోకి మార్చినట్లు సబ్ పోస్ట్‌మాస్టర్ బోని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ప్రజలు, ఖాతాదారులు సబ్‌పోస్టాఫీస్ కార్యాలయం మార్పును గమనించాలని, తపాలా సేవలను వినియోగించుకోవాలని కోరారు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 13లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఒ ఎం ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన వివిధ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంలు ఈనెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రచార జాతా ప్రారంభ కార్యక్రమంలో లోకనాథం



ప్రచార జాతా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు నేత లోకనాథం

ప్రజాశక్తి-పరవాడ

కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందని, వాటిని రద్దు చేయాలని కోరుతూ జులై 9న జరుగు దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మె ప్రచార జాతాను లంకెలపాలెంలో శుక్రవారం లోకనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలు విరమించుకోవాలని, సమాన పనికి సమాన వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని కోరారు. ప్రచార జాత పరవాడ, తానం, తాడి, ఫార్మాసిటీ మీదగా సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కె.పోతి నాయుడు, కె.వెంకట్రావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : జులై 9న దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాల శానిటేషన్ కార్మికులు పాల్గొంటున్నట్లు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి తెలిపారు. చోడవరం మెయిన్ స్కూల్లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజమ్మ, చిన్న తల్లి, అప్పియమ్మ, సుభద్ర, అధిక సంఖ్యలో మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను శుక్రవారం సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకు, ఇన్సూరెన్స్, స్టీలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని, దానిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టెక్కలి జగ్గారావు, ఆటో, వీఆర్ఏ సంఘ నాయకులు పైడికొండ, కాకి రాంబాబు, ప్రసాదు, శ్రీను, చిన్న, ఈశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

కశింకోట : ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్థానిక ఎంఇఒలు సురేష్ కుమార్, సూర్యనారాయణమూర్తిలకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎండిఎం యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీదేవి, బి సూర్యలక్ష్మి, కార్మికులు వి సత్యవతి, అచ్చయ్యమ్మ, వి నూకరత్నం, డి.నాగమణి, టి సన్యాసమ్మ, ఎం నూకరత్నం, కె పూర్ణమ్మ, బి మాలెమ్మ, వి లక్ష్మి, ఎం లక్ష్మి, బి లలిత పాల్గొన్నారు.


కశింకోటలో సమ్మె నోటీసు ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

చీడికాడ : చీడికాడ మండల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సమ్మె గోడ పత్రికను సిఐటియు డివిజన్ కార్యదర్శి దేవుడు నాయుడు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ యం కుమారి, మిడ్డేమీల్స్ యూనియన్ నాయకులు చిన్నమ్ములు, కుమారి, రవణమ్మ, దేవి, ఆశ వర్కర్ కమల కుమారి చిన్నమ్ములు, లక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : రోలుగుంటలో సిఐటియూ సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.త్రిమూర్తులరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వజ్రపు సత్యవతి, ఇంద్ర ఈశ్వరరావు, మణి పాల్గొన్నారు.

రావికమతం : దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని రావికమతం మండల సిఐటియు కార్యదర్శి వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు పోలరాతి అప్పారావు, కార్యదర్శులు గంజి భాస్కరరావు, కూరగాయల రమణ, ఉపాధ్యక్షుడు సరకాల గణేష్, సిఐటియు మండల కన్వీనర్ కె.గోవింద పాల్గొన్నారు.


పెందుర్తిలో మాట్లాడుతున్న మంగశ్రీ

మధురవాడ : అల్లూరి పోరాట స్ఫూర్తితో ఈనెల 9న జాతీయసమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మద్దిల పాలెం జోన్ అధ్యక్షులు డి అప్పలరాజు పిలుపునిచ్చారు. జివిఎంసి ఏడో వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ రామప్పాడు, పి రమేష్, ఎం కనకరత్నం, కె.లక్ష్మి, పి.వరలక్ష్మి, ఎం పార్వతి,బి నరసింగరావు పాల్గొన్నారు.

పెందుర్తి : ఈ నెల 9న సమ్మెలో పాల్గొంటున్నట్లు మధ్యాహ్నం భోజన కార్మికులు ఎంఇఒకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు, మెనూ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరిబాబు, వరహాలమ్మ దేవుడమ్మ, శోభ, గౌరీ లక్ష్మి రూప శానిటేషన్ కార్యదర్శి ఎల్లయ్యమ్మ పాల్గొన్నారు

తగరపువలస : ఈ నెల 9న జాతీయ సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస సిఐటియు కార్యాలయం నుంచి భీమిలి రోడ్డు, గొల్ల వీధి, వై జంక్షన్, మెయిన్ రోడ్డు, గుడివాడ, మూలకుద్దు మీదుగా చిప్పాడ దివీస్ వరకు బైక్‌ర్యాలీ కొనసాగింది. సమ్మె నేపథ్యాన్ని యూనియన్ నాయకులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు వివరించారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా విశాఖ జిల్లా, నగరంలో ఆటోలు బంద్ చేయాలని ఆటో కార్మికుల సమావేశం పిలుపునిచ్చింది. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో అఖిలపక్ష ఆటో కార్మిక సంఘాల నాయకులు జి.వామనమూర్తి, కె.సత్యనారాయణ, బి.జగన్, కాశీబాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.


చోడవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు


మునగపాకలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


తగరపువలసలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నేతలు


రోడ్డుపై గుంతలోని నీటిలో గేదెను కడుగుతున్న వైసిపి నేతలు

బిఎన్ రోడ్డు గుంతల్లో పశువులను కడిగి నిరసన

ప్రజాశక్తి-వడ్డాది : భీమిలి- నర్సీపట్నం ఆర్ అండ్ బి రోడ్డు దుస్థితిపై శుక్రవారం వైసిపి నేతలు వినూత్న నిరసన చేపట్టారు. మండల వైసిపి అధ్యక్షుడు కె.అచ్చం నాయుడు, వైస్ ఎంపిపి ఎంపిపి దొండా నారాయణ మూర్తి ఆధ్వర్యంలో వడ్డాది కూడలిలో చెరువును తలపిస్తున్న రోడ్డు గుంతలో పశువులను కడిగి, మొక్కలు నాటి నిరసన తెలిపారు. పాడి గేదెకు చెరువును తలపిస్తున్న బిఎన్ రోడ్డు గుంతలో స్నానం చేయించారు. ఈ గోతుల రోడ్డులో రాకపోకలు చేసే వాహనదారులు తరుచూ అదుపు తప్పి బోల్తాపడి గాయాల పాలవుతున్నారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను 108 వాహనంలో తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ రోడ్డు మెరుగుపరచి రవాణా కష్టాలు తీరుస్తామని బూటకపు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వాన్ని దూషించిన ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, ఎంపీ సీఎం రమేష్ ఇప్పుడు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కె.రమణ, జి ప్రసాద్, శంకర్రావు నాగేష్, రమేష్, అప్పారావు, ఎస్ నాగేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే విద్యుత్ స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్పొరేట్లను ఉద్ధరించడానికే ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, వీటి వలన ప్రజలకు వినియోగదారులకు లాభమేమిటని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బొట్టా చిన్ని యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామని బిల్లును పెంచుతామని హెచ్చరిస్తున్నారని, రకరకాల అబద్దాలు చెప్పి ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే సమయంలో వామపక్ష పార్టీలు, రైతు సంఘాలు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయని గుర్తు చేశారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు బిగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

6న వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 400 కెవి సింహాద్రి-గాజువాక లైన్‌కు సంబంధించి ఎర్త్ వైరు మార్చనున్న నేపథ్యంలో ఈనెల 6న వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల కొర్లప్రోలు, నరసింగబిల్లి, నర్సీపట్నం 132 కెవి ఉప కేంద్రాల పరిధిలో ఉన్న ఎస్ రాయవరం, ఎలమంచిలి, నరసింగబిల్లి, మునగపాక మండలం చూచుకొండ ఉపకేంద్రం, నర్సీపట్నం ఉప కేంద్రాల పరిధిలో రోలుగుంట, గొలుగొండ నాతవరం, కోటవురట్ల, కొత్తకోట పరిధిలో గల వ్యవసాయ సర్వీసులకు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం మూడు గంటల నుంచి 6 గంటల వరకు రెండు దఫాలుగా 9 గంటల విద్యుత్తు సరఫరా ఉంటుందని, దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కెజిబివి ప్రిన్సిపల్ అన్నపూర్ణను వేధింపులకు గురి చేసిన చోడవరం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ సీనియర్ నాయకులు కొరెడ్ల విజయ గౌరి

ప్రజాశక్తి-అనకాపల్లి : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపల్ అన్నపూర్ణను వేధింపులు గురిచేసి అస్వస్థతకు కారణమైన చోడవరం ఎమ్మెల్యే, ఇతరులపై చర్యలు తీసుకోవాలని యూటిఎఫ్ సీనియర్ నాయకులు కొరెడ్ల విజయ గౌరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపల్ అన్నపూర్ణను అనకాపల్లిలోని ఆమె ఇంట్లో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విజయ గౌరి మాట్లాడుతూ ఇటీవల వడ్డాది కేజీబీవీలో విద్యార్థుల చేరిక విషయంలో స్థానిక కూటమి నాయకుల్లో గ్రూపు తగాదాల నేపథ్యంలో ప్రిన్సిపల్‌ను తీవ్ర మానసిక ఒత్తిడి గురి చేయటం, దుర్భాషలాడటం, అస్వస్థత గురి అయ్యే విధంగా ఎమ్మెల్యే తన అనుచరులు ప్రవర్తించటం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ఒక మహిళా ఉద్యోగిని పట్ల ఒక ప్రజాప్రతినిధి ఈ రకంగా వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఉద్యోగులపైనా, అందులోనూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ చిరుద్యోగులపై, మహిళలపై ఇటువంటి వేధింపులు, దుర్భాషలాడే ధోరణి అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము సుపరిపాలన అందిస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వం మహిళలకు కనీస గౌరవం ఇవ్వకుండా చేయటమే సుపరిపాలనా అని ప్రశ్నించారు. జిల్లాలోనూ రాష్ట్రంలోనూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యోగులు అందరితో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జేఏసీ నాయకులు వివి శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు జీకే ఆర్ స్వామి, అలివేలు, హేమలత, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.


అన్నపూర్ణతో మాట్లాడుతున్న విజయగౌరి, యుటిఎఫ్ నేతలు

కల్తీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : కల్తీ మద్యం తయారీదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐద్వా రాంబిల్లి మండల కార్యదర్శి సిహెచ్ మంగతాయారు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కల్తీ మద్యం వల్ల ఆరోగ్యాలు దెబ్బతిని ఎంతో మంది మృత్యువాతకు గురవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం గంజాయి మత్తు పదార్ధాలను నిషేధించాలని కోరారు. స్పిరిట్‌తో తయారు మద్యం తయారు చేస్తున్న వారిపైనా, దానిని బెల్ట్ షాపులు అమ్ముకాలు జరుపుతున్న వారిపైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు నూకరత్నం, మహేశ్వరి, రాజేశ్వరి, అమ్మాజీ పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం ప్రజల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన వివిధ తరగతుల ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను విన్నవించారు. కొన్నిటిని సంబంధిత అధికారులతో మాట్లాడి విని వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటిని కొంత సమయంలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

మునగపాక : స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎలమంచిలి నియోజకవర్గ పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పార్టీ శ్రేణుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, దొక్కా నాగభూషణం, పెంటకోట విజయ్,కాండ్రేగుల శంకర్, ఉలింగల గోవిందా, సబ్బి శ్రీను, దాడి శివ, భాగ్యరాజు, పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఒకేషనల్ గ్రూపులు ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో త్వరలో ఒకేషనల్ గ్రూపులు ఎంపిహెచ్‌డబ్ల్యు, ఇఇటి ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. ఇటీవల నూతనంగా విధుల్లో చేరిన కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావు, పలువురు అధ్యాపకులు శుక్రవారం ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాల స్థితిగతులపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇ.నరసింహమూర్తి, వీపురుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు

స్లాబ్ పెచ్చులూడి బ్యాంగిల్ షాపు ధ్వంసం

ప్రజాశక్తి-దేవరాపల్లి : పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న యానాపు కృష్ణ బ్యాంగిల్ షాపులో శుక్రవారం తెల్లవారుజామున స్లాబ్ అడుగుభాగం పెచ్చులూడిపోయి బ్యాంగిల్స్ షాప్ మొత్తం ధ్వంసమైంది. సుమారుగా రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగిందని కృష్ణ వాపోయాడు. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం ఇప్పించాలని ఆయన కోరాడు.

చెత్త నుండి ఎరువు తయారు చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : చెత్తను వృధా చేయకుండా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ద్వారా ఎరువు తయారు చేయాలని జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి పొడి చెత్త వేరు వేరు చేసి ఇవ్వాలన్నారు. రైల్వే ట్రాక్ వద్ద చెత్త తొలగించాలని కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్, కార్యదర్శి డి.బాబూరావు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలి

ప్రజాశక్తి- కశింకోట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి అన్నారు కశింకోట పీహెచ్సిని, బయ్యవరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను శుక్రవారం ఆమె సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ తిరుపతి రావు, ఆరోగ్య విస్తరణ అధికారి సిహెచ్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మక శక్తి పెంపు

ప్రజాశక్తి-సబ్బవరం : విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవచ్చని ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రతిభ విద్యాలయంలో శుక్రవారం విజ్ఞాన్ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులతో ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ డిస్ప్లే, పోస్టర్ ప్రెజెంటేషన్ ఎండ్ లైవ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు 65 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో పాల్గొనగా 6 నుండి 10వ తరగతుల విద్యార్థులు వాటిని జిజ్ఞాసతో తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆదిరెడ్డి శరత్ తేజ, ప్రధానోపాధ్యాయురాలు కనకమహాలక్ష్మి, పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రమే పి4 లక్ష్యం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే విజన్ 2047- పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా జిల్లా దార్శనికత కార్యాచరణ ప్రణాళికపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, సీఎస్ఆర్ ప్రతినిధులతో మంత్రి నిర్వహించారు. ముందుగా జిల్లా ప్రణాళికాధికారి జి.రామారావు ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం (పి4)పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో విజన్ డాక్యుమెంట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆదాయం, కుటుంబ ఆదాయాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలపై చర్చించుకున్నామన్నారు. ప్రత్యేకంగా వ్యవసాయం, సేవ, పారిశ్రామిక రంగాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు చెప్పారు. విశాఖ జిల్లా తలసరి ఆదాయం రూ.4,57,683 ఉంటే., అనకాపల్లి తలసరి ఆదాయం కేవలం రూ.2,33,990 మాత్రమే ఉందని, దీనిని తగ్గించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటి వరకు 2,104 బంగారు కుటుంబాలను గుర్తించి 1700 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం ఈ అంశంపై కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంచార్జ్ మంత్రి మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపి సీఎం రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, సుందరపు విజయ్ కుమార్, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు మల్ల సురేంద్ర, ప్రగడ నాగేశ్వరావు, పివిజి కుమార్, పీలా గోవిందరావు, బత్తుల తాతయ్యబాబు, డిఆర్వో వై.సత్యనారాయణ రావు, జిల్లా అదనపు ఎస్పీ, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి రవీంద్ర, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

మానికొండ సూర్యావతికి ఘన నివాళి


సూర్యావతి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పరవాడ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా సంఘం నాయకులు మానికొండ సూర్యావతి వర్ధంతి కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. సూర్యావతి చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు చేతుల మీదుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నేత మాణిక్యం మాట్లాడుతూ హైదరాబాదు రాష్ట్రంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో సూర్యావతి చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, జయలక్ష్మి, పద్మ, కృషిత, చాందిని, శ్వేత, ఆశాకుమారి, అక్షయ, యజ్ఞవల్లిక, రోజా, గిరేష్మ, మౌనిక, అరుణ, భార్గవి, హిందూ, కుమారి, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో...

పరవాడ టిడ్కోకాలనీలో మానికొండ సూర్యావతి చిత్రపటానికి ఐద్వా ఆధ్వర్యం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం మాట్లాడుతూ సూర్యావతి నిరంతరం మహిళా సమస్యలపై ఉద్యమించారని, సమానత్వం కోసం పోరాడారని తెలిపారు. గ్రామాలకు వెళ్లి మీటింగ్‌లు పెట్టి కథలు, నాటకాలు రూపాల్లో మహిళలను చైతన్య పర్చారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా స్థానిక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, నాయకులు మంగమ్మ, సీతమ్మ, సాయి వెంకటి, రాజకుమారి, నాగదేవి, సరోజిని, అబద్ధం, కే లక్ష్మి, గంగాభవాని, బేగం, గోపాల్ రావు, కనకమహాలక్ష్మి, కందలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-సబ్బవరం : రానున్న 2029 ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం రావడం ఖాయమని అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు గుడివాడకు అమర్నాథ్ జోస్యం పలికారు. మండలంలోని ఇరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో పెందుర్తి ఇన్చార్జి అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన పెందుర్తి నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైసీపీ అధినేత ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేశారని విమర్శించారు. పెందుర్తి ఇంచార్జి అదీప్ రాజ్ మాట్లాడుతూ వైసిపి నేతలు కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు గండి రవికుమార్, పైలా శ్రీనివాసరావు, శరగడం చిన అప్పల నాయుడు, బైలపూడి భగవాన్ జయరాం, పైలా సన్యాసిరాజు, కోటాన రాము, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, నవ్య, కర్రిబాబు, వడ్డాది అప్పలరాజు, రాపేటి రాము, ఎడ్ల నాయుడు, బలిరెడ్డి కనకరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరిక

ప్రజాశక్తి- సబ్బవరం : పలు ప్రైవేటు పాఠశాలల నుండి సుమారు 14 మంది విద్యార్థులు స్థానిక సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరినట్లు ఎంఈఓ-2 ఎంజె రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై విద్యార్థులు ఆకర్షితులై ప్రభుత్వ పాఠశాలలో చేరినట్లు చెప్పారు. రావులమ్మ పాలెం జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు సత్యనాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం తేదీని పొడిగించాలి

ప్రజాశక్తి-కశింకోట : తల్లికి వందనం పథకానికి తేదీ పొడిగించాలని జనసేన మండల నాయకులు మళ్ల వెంకట రమణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో వివిధ కారణాలు వల్ల 32 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హత వున్నా అందలేదని తెలిపారు. ఈ విషయంపై శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకొనికెళ్తున్నట్లు చెప్పారు.

యూట్యూబర్‌పై కేసు


యూట్యూబర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాజకీయ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ యూట్యూబర్‌పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కె.కోటపాడు సిఐ పైడప్ప నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.... దేవరపల్లి మండలం వెంకటరాజుపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆర్ఎంపి వైద్యుడిగా పనిచేస్తూ విశ్వాస్ టీవీ అనే పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, దేవరపల్లి మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, పాత్రు నాయుడు, కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహానాయుడు తదితర ముఖ్యమైన నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రకరకాల కథనాలు సృష్టిస్తూ పోస్టులు పెడుతున్నారు. వాటిని తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల చేత వైరల్ చేయించి ప్రజల్లో వారిపై ఉన్న గౌరవానికి భంగం కలిగిస్తున్నాడు. ఆధారాలు లేకుండా 'అవినీతిపరులు, లంచగొండులు, ప్రజలను పీడించుకు తినే రాబందులు, ఇలాంటివారిని నడిరోడ్డుపై కాల్చి పారేయాలి' అంటూ ప్రచారం చేస్తున్నాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరపల్లి ఎస్సై మల్లేశ్వరరావు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. యూట్యూబ్‌కు చెందిన పరికరాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడి

ప్రజాశక్తి- అనకాపల్లి : పంటల్లో అధిక ఉత్పత్తి సాధించాలంటే ముందుగా విత్తన శుద్ధి చేసుకొని నాటుకోవాలని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతంతో విత్తన శుద్ధి చేయించడంపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల వరి నారుకు ఎటువంటి క్రిమికీటకాలు, తెగుళ్ళు సోకకుండా ఆరోగ్యంగా ఎప్పుగా పంట పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగేశ్వరరావు, వీరు నాయుడు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం పోలమాంబ గుడి ఏరియాలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన మంచి బోరును ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు, కూటమి పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

వీధి కుక్కలు స్వైర విహారం

దాడిలో కోళ్లు మృత్యువాత- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేట గ్రామంలో వీధి కుక్కల స్వైర్య విహారం చేశాయి. వీధి కుక్కల దాడిలో కోళ్ళు మృత్యువాత పడ్డాయి. ఆవు, గేదెలు, లేగ దూడలతో పాటు మనుషులకు గాయాలయ్యాయి. దీంతో పసిపిల్లలు వీధిలో తిరిగేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి కుక్కల భారీ నుంచి కాపాడండి మహాప్రభో అంటూ పలుమార్లు పంచాయతీ పాలకవర్గాలకు, అధికారులకు తెలియజేసినప్పటికీ కనీసం వాటిని నియంత్రించే కార్యక్రమాలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందంటూ ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
శనివారం 5 జులై 2025

మార్టేరు వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

- ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ సాయి



వరి నారు మడి పరిశీలిస్తున్న ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్, అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:తెగుళ్ళ, పురుగులు వ్యాప్తిని తట్టుకునే మార్టేరు వరి విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ కే సాయి రైతులకు సూచించారు. మండలంలో ఉద్దండపురం, నక్కపల్లి రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసారు. రైతులకు పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉంచిన వరి విత్తనాలను పరిశీలించారు. మండలంలో సుమారుగా 920 క్వింటాలు వరి విత్తనాలను ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ తెలియజేశారు. ఆర్ జి ఎల్ 2537, మార్టేరు 1061 ఇంద్ర, 1064 అమర,1121 శ్రీ ధృతి, 1224 మార్టేరు సాంబ, 1262 మార్టేరు మసూరి వంటి రకాల వంగడాలను రైతుల కోసం అందుబాటులో ఉంచామని, ఇప్పటికే చాలా వరకు విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎప్పటికపుడు విత్తనాల అమ్మకాలు ప్రక్రియ ఆన్లైన్‌తో పాటు నాన్ సబ్సిడీ ను ఏపీ సీడ్స్ కు జమ చేయాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో నారుమడులు పరిశీలించి రైతులకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. వరి విత్తనాలను మొలక పరీక్ష చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ సాయి కుమారి, ఆర్ ఎస్ కె సిబ్బంది రాకేశ్, నాయుడు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో సిహెచ్ లక్ష్మీపురం లో జరుగుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం ఉదయం ఎంపీడీవో డి సీతారామరాజు పరిశీలించారు.

ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ పై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. తడి పొడి చెత్త సేకరణ పై ఇంటింటా అవగాహన కల్పించి, సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ముమ్మరంగా శానిటేషన్ పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు.



నివాళి అర్పిస్తున ఐద్వా మహిళా నేతలు

సూర్యావతికి ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఐద్వా రాష్ట్ర నాయకురాలు, కీర్తిశేషులు మానికొండ సూర్యావతి జీవితం, మహిళల కోసం ఆమె చేసిన కృషి ఆదర్శనీయమని ఐద్వా జిల్లా నాయకులు ఎల్.గౌరీ, కె.వి.సూర్యప్రభ కొనియాడారు. ఐద్వా ఆధ్వర్యంలో నర్సీపట్నం కొత్త వీధిలో మానికొండ సూర్యావతి 31 వ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా సూర్యావతి చిత్రపటానికి ఐద్వా నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆనాడు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సూర్యావతి మహిళల కోసం జీవిత కాలం పాటు పడ్డారనీ కొనియాడారు, ప్రజా ప్రతినిధిగా కూడా ఆమె సమర్థవంతంగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యకర్తలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురంలో రాయితీపై వరి విత్తనాలను సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుధారాణి, గొంతిన సూరిబాబు పాల్గొన్నారు.

కాలేజీల్లో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలి

ప్రజాశక్తి- పాడేరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, గ్రూపులో 20 చొప్పున ప్రతి కళాశాలలో సీట్లు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు మండల కేంద్రంలో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నూతన సంవత్సరం అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, అడ్మిషన్ ఫీజులు తగ్గించాలన్నారు. డిగ్రీలో అడ్మిషన్ ఫీజులు భారం కాకూడదని తెలిపారు. డిగ్రీ కళాశాలలో ఫీజులు భారంగా ఉందన్నారు.

మార్కెట్ యార్డులో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-నర్సీపట్నం: పెద్ద బొడ్డేపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి పసుపు ప్రాసెసింగ్ గోదాం లో జరిగిన ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం తో పాటు యంత్రాలతో పాటుగా గోదాము కూడా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దాదాపుగా 65 మెట్రిక్ టన్నుల పసుపు తో పాటు భారీ యంత్రాలు కూడా ధ్వంసమైనట్లు అధికారులు వెల్లడించారు. దాదాపుగా కోటి పది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు, గాయత్రి ఆగ్రో ఫార్మ్స్ నిర్వహిస్తున్న ఈ గోదాములో ప్రమాదము షార్టు సర్క్యూట్‌తో జరిగినట్లు తెలిసింది. మంటలను ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణ, ఆర్డిఓ వివి రమణ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర , తహసిల్దార్ రామారావు ప్రమాద స్థలానికి చేరుకొని కారణాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

కొనసాగిన ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సమస్యలను పరిష్కరించాలని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న నిరసన శుక్రవారం 14వ రోజుకు చేరుకుంది. జీతాలపెంపు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. కార్మికులు వినూత్న రీతిలో మోకాళ్లపై నిలబడి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.



నిరసన చేపడుతున్న కార్మికులు



మృతి చెందిన ఆవు

పాము కాటుతో ఆవు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సీహెచ్. నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావుకు చెందిన పాడి ఆవు పాము కాటుకు గురై మృతి చెందింది. గురువారం మేత కోసం విడిచిపెట్టగా రాత్రి అయినా పాకకు చేరలేదు. దీంతో ఉదయం కొందరు పొలాల్లో ఆవు మృతి చెంది పడి ఉండటాన్ని గమనించి తనకు సమాచారం ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. పశు వైద్యులు వచ్చి ఆవును పరిశీలించడం జరిగిందన్నారు. ఆవు విలువ రూ.50వేలు ఉంటుందని చెప్పారు.

పల్లాపై వ్యక్తిగత ద్వేషం లేదు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుపై తనకు ఎటువంటి వ్యక్తిగత ద్వేషం లేదని, ఆయనతో వ్యాపార భూ తగాదాలు లేవని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక హొటల్లో ఆయన మాట్లాడుతూ, తనపై దాడి చేసిన వారికి శిక్ష పడే వరకు, పల్లా బహిరంగ క్షమాపణ చెప్పే వరకు వదిలి పెట్టనన్నారు. తనపై జరిగిన దాడిలో మురళి ప్రధాన సూత్రధారని, అతన్ని అరెస్టు చేసే వరకు ధర్మ యుద్ధం కొనసాగుతుందన్నారు. అల్లూరి సమాధి సాక్షిగా పోరాట స్ఫూర్తి కోసమే ఇక్కడికి వచ్చానన్నారు.తాను ఎవరికీ భయపడనని, చావంటే భయం లేదన్నారు. ఇది ఆత్మగౌరవ పోరాటమని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించుకుని సమస్య పరిష్కారం చేస్తే మంచిది అన్నారు.



మాట్లాడుతున్న బివి రామ్



వ్యాసరచన రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎమ్. ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహణలో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందిస్తున్న తల్లికి వందనం, విద్యార్థి మిత్ర, వంటి పథకాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించడం జరిగిందని, విజేతలకు పేరెంట్ సమావేశంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీలను తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు, పలువురు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పాయకరావుపేట:ఐఎన్‌టిఎస్ఓ ఒలింపియాడ్ పరీక్షలో పాయకరావుపేట శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభను కనబరచి అనేక బహుమతులు గెలుచుకున్నారు. పూజిత, వేదిక, సౌమ్యలు పలు బహుమతులు గెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ జి అప్పన్న విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ, శ్రీ చైతన్య విద్యార్థులు చదువుతోపాటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ పంచదార్ల మాణిక్యాలరావు మాట్లాడుతూ, ఈ విజయానికి పాఠశాల సిబ్బంది అందించిన ప్రత్యేకమైన శిక్షణ, అంకితభావం, విద్యార్థుల శ్రమే మూల కారణమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎం వి సురేష్, ఆర్ఐ గోపీనాథ్, అకాడమిక్ కో ఆర్డినేటర్ పట్నాయక్, వైస్ ప్రిన్సిపాల్ రమణ, సి బ్యాచ్ ఇంఛార్జి లక్ష్మీకాంతం, డీన్ మనీష్ , ప్రైమరీ ఇంఛార్జిలు కల్పన, ఝాన్సీ, ఎఒ విజయ్ పాల్గొన్నారు.

6న వైసిపి సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంటలో ఈ నెల 6న వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి జిల్లా అధ్యక్షులు, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కూడా హాజరు కానున్నారని చెప్పారు. మండల స్థాయి నాయకులంతా తప్పనిసరిగా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

గొప్ప పోరాట యోధుడు.. అల్లూరి

-ఆ మహనీయుని ఆశయ సాధనకు కృషి చేయాలి -జయంతి వేడుకల్లో వక్తలు
-కేడీ పేటలో నివాళి అర్పించిన స్పీకర్ అయ్యన్న, పలువురు మంత్రులు


నర్సీటపన్నంలో అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తలపెట్టిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేశ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంధ్ర, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జయంతి వేడుకలకు హాజరయ్యారు. విద్యార్ధులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అల్లూరి, గంటన్న సమాధుల వద్ద పుష్పాలు సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, అల్లూరి పార్కు అభివృద్ధికి మంత్రులు నిధులు వెచ్చించాలని కోరారు.

విజయనగరం ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ తన రూ.10లక్షల నిధులను విప్లవ వీరుడు అల్లూరి స్మారక ప్రాంతానికి ఉపయోగపడడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ తనవంతుగా పార్కు అభివృద్ధికి రూ 30 లక్షల నిధులు ఇస్తానని ప్రకటించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ,స్పీకర్ అయ్యన్న కోరిక మేరకు రూ.5లక్షలు నిధులు ప్రకటించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ తో చర్చించి పార్కు అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,పర్యాటక ప్రాంతాలను అభివద్ధి పరచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. విద్యార్ధులు థింసా వంటి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ, టీడీపీ జిల్లా అధ్యక్షులు తాతయ్యబాబు, గొలుగొండ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ మేరీరోజ్, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ పాల్గొన్నారు.

నక్కపల్లి:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజు, వేంపాడు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించారు. తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, క్షత్రియ సంఘం ప్రతినిధులు అయినంపూడి పేర్రాజు, విజయ్ కుమార్ రాజులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు వీసం రామకష్ణ, కొప్పిశెట్టి కొండబాబు, గింజాల లక్ష్మణరావు, శీరం నరసింహమూర్తి, మణి రాజు, అప్పలరాజు, బుజ్జి, సురేష్ వర్మ, భార్గవ్, శ్రీనివాసరావు, మధు, కనకారావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంధాలయంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను లైబ్రేరియన్ పి దమయంతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రిసోర్స్ పర్సన్ బిఎస్ ప్రసాద్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, ప్రసాద్, నూకరాజు నివాళులు అర్పించారు.

నర్సీపట్నం టౌన్:పెదబొడ్డేపల్లి వైయస్సార్ ట్యాంక్ బండ్ వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, నాయకులు పెట్ల అప్పలనాయుడు, తమరాన శ్రీను, కర్రి శ్రీను, భేతిరెడ్డి విజయ్, యాదగిరి శేషు, షేక్ రోజా, చీటీల రాము, సుధీర్, వాసు పాల్గొన్నారు.

నర్సీపట్నం:నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని స్పీకర్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. విగ్రహం సమీపంలోని 50 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, నర్సీపట్నంలో విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

గొలుగొండ:పాతకృష్ణదేవిపేటలో సర్పంచ్ పందిరి సత్యంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. చీడిగుమ్మల, చోద్యం గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మాకిరెడ్డి రామునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్ల:మాకవరపాలెం మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ మోహనరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి సమన్వయకర్త బి గణేష్, డానియల్ రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీర యోధుడు అల్లూరి సీతారామరాజు అని అదనపు ఎస్పీలు దేవ ప్రసాద్, ఎల్ మోహన్‌రావు అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, లక్ష్మి, రమేష్, గఫూర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ సత్యనారాయణరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, పి.జయంతి, వీరం నాయుడు, విజయ్ కుమార్, పివి.రత్నం, ఎస్ఎస్‌విఎస్ నాయుడు, రాజేశ్వరి పాల్గొన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జయబాబు సీతారామరాజు చిత్రపటానికి నివాళు లర్పించారు.

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి గూడ్స్ రోడ్డు జంక్షన్‌లో అల్లూరి విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని గోవాడ గ్రామంలో చోడవరం సుగర్స్ ఎమ్‌డి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు అల్లూరి చిత్ర పటానికి నివాళు లర్పించారు. అనంతరం వృద్ధులకు బట్టలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం కార్యదర్శి బేరా సత్యారావు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మరిషా సతీష్, మరిసా నరేష్, మాజీ సర్పంచ్ ఎండపల్లి సత్యారావు, నాగులాపల్లి లెనిన్ బాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అల్లూరి విగ్రహానికి మాజీ సర్పంచ్ మూలగుమ్మి ఈశ్వరమ్మ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చెల్లిబోయిన కృష్ణ, ఉగ్గిన ఈశ్వరమ్మ, ఉగ్గిన రంగడు, కొండమ్మ, పైడిరాజు, రవి, నూకరాజు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి అరకు ఎంపీ గుమ్మా తనుజారాణి, బొడ్డేడ ప్రసాద్, వైకాపా నేతలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మల్లవరం గ్రామంలో అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పూలమాల వేశారు. కార్యక్రమంలో పి వాసు, పి రవీంద్ర, శరగడం కనుమ నాయుడు, బాబురావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్పూర్ణా మార్కెట్ జంక్షన్‌లోని అల్లూరి విగ్రహం వద్ద ముఠా కార్మికుల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరిగాయి. ముఠా కార్మిక సంఘాల నాయకులు ఎం.సుబ్బారావు, .మన్మధరావు పాల్గొన్నారు.

గాజువాక : ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంచరపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నాయకులు చిట్టిబాబు, ఎస్.దామోదర్, కె.చిన్నం నాయుడు పాల్గొన్నారు. అల్లూరి స్ఫూర్తితో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాడతామన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని పార్కు హోటల్ సమీపంలో అల్లూరి విగ్రహం వద్ద, కలెక్టరేట్ వద్ద వేర్వేరుగా కార్యక్రమాలు జరిగాయి. కలెక్టర్ ఎంఎన్.హరంధిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్ పాల్గొన్నారు.

గోపాలపట్నం :జివిఎంసి 90 వ వార్డు సుసర్లకాలనీ సీతారామరాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కులో ౖ అల్లూరి విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు కార్పొరేటర్ బొమ్మిడ రమణ, వార్డు ప్రసిడెంట్ అరుణ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖపట్నం క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో సీతమ్మదార క్షత్రియ కల్యాణ మండపంలో అల్లూరి జయంతి సందర్భంగా మెగా రక్త దానం, ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌కె. రాజు,శ్రీనివాసరాజు,మురళీ మహేష్ రాజు,కష్ణంరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార జంక్షన్లో ఉన్న అల్లూరి విగ్రహానికి ఎఐటియుసి, ఎవైఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఎఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రామకృష్ణ. కోట సత్తిబాబు సిపిఐ నాయకులు పడాల గోవింద్ ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎం మధురెడ్డి రావి అశోక్. బోరా రమణ పాల్గొన్నారు


పద్మనాభంలో నివాళి అర్పిస్తున్న మంత్రి దుర్గేశ్

సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో అల్లూరి చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, టి వి సూర్యప్రకాష్, టి వనజ, సీజీఎం లు వి విజయలలిత, డి సుమన్ కళ్యాణి, బి రామచంద్రప్రసాద్, అచ్చి రవికుమార్, ఎస్ హరిబాబు నివాళులర్పించారు.

ఆనందపురం: మండలంలోని పందలపాకలో భారత్-టిబెట్ సరిహద్దు పోలీసు (ఐటిబిపి) 56వ బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కమాండెంట్ హరిసింగ్, బెటాలియన్ అధికారులు, హిమవీర్ జవాన్లు, సహాయక సిబ్బంది ,తర్లువాడ, జగన్నాథపురం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు రామకృష్ణాపురంలో అల్లూరి విగ్రహానికి వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు టిడిపి నాయకులు మారిక జక్కన్న,కొండపల్లి పైడ్రాజు, నేతల.త్రినాధ్, గుంజ.శీను, ఎస్.కె నూరి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొమ్మాది : గణేష్‌నగర్ పిహెచ్‌సిలో అల్లూరి విగ్రహానికి బిజెపి నేత ఎన్.సుబ్బరాజు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు.నేతలు ఎండ. అప్పారావు పసుపులేటి శ్రీనివాసరావ బ్రహ్మాజీ రావు పాల్గొన్నారు

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరికి ప్రిన్సిపల్ సిహెచ్ విష్ణు మూర్తి, ఎన్ఎస ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు,విద్యార్థులు నివాళులర్పించారు. సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్, ఆటోస్టాండ్ వద్ద అల్లూరి చిత్ర పటానికి నాయకులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు నివాళులర్పించారు. సిపిఐ కార్యాలయంలో చిట్టి వలస లేబర్ యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, కానూరు రాంబాబు, మోర అప్పలరాజు అల్లూరికి నివాళులర్పించారు.

స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో అల్లూరి చిత్ర పటానికి అవంతి విద్యా సంస్థల చైర్మన్, ము త్తం శెట్టి శ్రీనివాసరావు, అతని సతీమణి జ్ఞానేశ్వరి నివాళు లర్పించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

మధురవాడ : పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అల్లూరికి పూలమాలవేసి నివాళులర్పించారు. జగన్మోహన్ చౌదరి, రమణ ,పాపారావు, వంటాకుల శ్రీనివాస్ రావు, ఆశాశ్వరుప్, దువ్వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మధురవాడ ఎఎస్‌ఆర్ నగర్‌లో అల్లూరి విగ్రహానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు నివాళు లర్పించారు.

సినీ హబ్‌గా విశాఖ అభివృద్ధి : మంత్రి దుర్గేశ్

పద్మనాభం: విశాఖపట్నాన్ని సినీ పరిశ్రమ హబ్‌గా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్.అన్నారు. శుక్రవారం మండలంలోని పాండ్రంగి గ్రామంలో అల్లూరి 128 జయంతి వేడుకల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో కలిసి అల్లూరి పార్కులో ఉన్న అల్లూరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ,. అల్లూరి నడియాడిన ప్రాంతంలో మంత్రిగా వచ్చినందుకు గర్విస్తున్నానన్నారు. అనంతరం అల్లూరి నివాసానికి వెళ్లి, ఆయన తల్లి నారాయణమ్మ, సీతారామరాజు రాతి విగ్రహాలకు పూలమాలలో శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అల్లూరి ఏకపాత్ర అభినయాన్ని తిలకించి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సత్కరించారు. మాజీ మంత్రి ఆర్‌సిడిపి అప్పల నరసింహరాజు. జనసేన భీమిలి ఇంచార్జ్ సందీప్ కుమార్, రూపాకుల రవికుమార్, కె లీలావతి. భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు, పావని కె. రమణ, కె.దామోదరరావు. రామరాజు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

సిపిఎం, సిఐటియు నేతల ఘన నివాళి

ప్రజాశక్తి-చోడవరం:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పిలుపునిచ్చారు. అల్లూరి 128వ జయంతి సందర్భంగా చోడవరంలో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ అల్లూరి ఉద్యమ స్ఫూర్తితో చోడవరం నుండి నర్సీపట్నం వరకు రోడ్డునిర్మాణం పనులు పూర్తి అయ్యేంత వరకు ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వి.నాయుడు, సిఐటియు నాయకులు ఈర్లె నాయుడుబాబు, గీతకార్మికసంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, కెవిపియస్ జిల్లా అధ్యక్షులు జి.ప్రసాద్, బి అప్పారావు, రాజు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో అల్లూరి విగ్రహానికి అల్లూరి సంఘం, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేవుడు నాయుడు, అల్లూరి సంఘం అధ్యక్షులు భూపతి అప్పారావు, ఐద్వా మండల కార్యదర్శి చందక మంగతాయారు, సిఐటియు మండల కన్వీనర్, చందక రామకృష్ణ, యువజన సంఘం నాయకులు ఎరిపిల్లి రాము, ఆటో, ముఠా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట, హరిపాలెం గ్రామాల్లో అల్లూరి చిత్రపటాలకు సిఐటియు, రైతు సంఘం నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు, ఎం రామ్‌కుమార్ పాల్గొన్నారు.